



sahanamvande.com
epaper.sahanamvande.com

# సహానం వందే

హైదరాబాద్ | 03-07-2026 శుక్రవారం | సంపుటి-02 సంచిక : 93 EDITOR: ROHINI




# ఏడడుగుల్లో మూడుముళ్లు

## రిజిస్ట్రేషన్ పెళ్లి చెల్లదన్న గుజరాత్ హైకోర్టు




**ఆధునిక ప్రపంచంలో పెళ్లిళ్ల తీరు మారిపోయింది. విందులు, వినోదాలు, డ్యాన్స్‌లు పెరిగాయి. పెళ్లి అంటే కేవలం అలంకరణలు, విందులు కాదు. అది రెండు ఆత్మల కలయికకు సంబంధించి పవిత్ర ప్రక్రియ. మంత్రోచ్ఛారణల మధ్య, అగ్ని సాక్షిగా జరిగే సప్తపది ముఖ్యం. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉంటే సరిపోదు. కోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు నేటి ఆధునిక కాలంలో పెళ్లి అర్థాన్ని కొత్తగా చూపిస్తున్నాయి.**
**- సహానం వందే, గుజరాత్**

- వేద మంత్రాలు... అగ్ని సాక్షి పెళ్లికే ఆమోదం
- ఏడడుగుల సప్తపది విధిగా జరగాలని తీర్పు
- సంప్రదాయమే ఆధ్యాత్మిక పునాది అని వెల్లడి
- ఆచారాలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి
- పెళ్లంటే ఆటలు... పాటలు... డాన్సులా?
- డెస్టినేషన్ పెళ్లిళ్లపై 'గుజరాత్ హైకోర్టు ఫైర్'

గుజరాత్ హైకోర్టు జూన్ 23న సంచలన తీర్పు ఇచ్చింది. కేవలం రిజిస్ట్రేషన్‌తోనే పెళ్లిని ధృవీకరించలేమని స్పష్టం చేసింది. సప్తపది వంటి మతపరమైన ఆచారాలు తప్పనిసరి. ఇవి లేకుండా పెళ్లి పూర్తవదు. హిందూ వివాహ చట్టం ప్రకారం వివాహానికి కొన్ని ప్రత్యేక ఆచారాలు ఉన్నాయి. సప్తపది అనేది వాటిలో అత్యంత ముఖ్యమైనది. వరుడు, వధువు ఏడు అడుగులు నడవడం వెనుక పెద్ద అర్థం ఉంది.కేవలం వేదిక మీద కూర్చుంటే వివాహం కాదు. వేద మంత్రాలు,అగ్ని సాక్షిగా జరిగే తంతు ముఖ్యం. ఇది వ్యక్తి ఆధ్యాత్మిక పరివర్తనకు మార్గం అని కోర్టు అభిప్రాయపడింది. ఆచారాలు లేని వివాహం చెల్లదని కోర్టు స్పష్టం చేసింది.

### రిజిస్ట్రేషన్ మాత్రమే చాలదు

చాలామంది రిజిస్ట్రేషన్ చేసుకుంటే పెళ్లి అయినట్లే అనుకుంటారు. కానీ అది కేవలం



చట్టపరమైన ధృవీకరణ మాత్రమే. అది వివాహానికి ప్రాణ ప్రతిష్ట చేయదు. ఆచారాలు ఆత్మను శుద్ధి చేస్తాయి. భౌగోళికంగా ఆచారాలు మారవచ్చు. ప్రాంతాల బట్టి పద్ధతులు వేరుగా ఉండవచ్చు. కానీ సప్తపది వంటి మౌలిక ఆచారాలు లేకపోతే అది వివాహం కాదని కోర్టు తేల్చి చెప్పింది.చట్టం కంటే సంస్కృతికి పెద్దపీట వేసింది. అది ఒక గొప్ప సంస్కృతి. వేల ఏళ్లుగా వస్తున్న ఆచారాల పునాది. కానీ అసలైన అర్థం కనుమరుగవుతోంది. వివాహ వ్యవస్థ గౌరవాన్ని కాపాడాల్సిన అవసరాన్ని కోర్టు గుర్తు చేసింది.

### వేడుక కాదు పవిత్రబంధం

పెళ్లిళ్లు ఇప్పుడు డెస్టినేషన్ వెడ్డింగ్‌లయ్యాయి. ఖరీదైన దుస్తులు, విపరీతమైన ఖర్చులు పెరిగాయి. పెళ్లి అంటే కేవలం ఒక సెలబ్రేషన్ కాదు.అది ఇద్దరు వ్యక్తుల జీవిత ప్రయాణం. అనవసరమైన హడావిడిలో అసలైన అర్థాన్ని మర్చిపోకూడదు. వివాహ పవిత్రతను గౌరవించడం అందరి బాధ్యత. రిజిస్ట్రేషన్ అనేది ఒక సాక్ష్యం మాత్రమే. అది పెళ్లిని పూర్తి చేయదు. హిందూ వివాహ చట్టం దీన్ని స్పష్టం చేస్తోంది. ఆచారాలు పాటించని వివాహం చెల్లదు. ఇది కేవలం కోర్టు ఆదేశం కాదు.సమాజానికి ఒక హెచ్చరిక కూడా. బంధాల విషయంలో అప్రమత్తత అవసరమని కోర్టు గుర్తు చేస్తోంది.

### సంస్కృతికి ప్రాణం పోయాలి

ఈ తీర్పు సమాజానికి ఒక హెచ్చరిక. వివాహ బంధాన్ని తేలికగా తీసుకోకూడదు. ఆచారాల వెనుక ఉన్న అంతరార్థాన్ని అర్థం చేసుకోవాలి. రాబోయే తరాలకు మన సంప్రదాయాలను అందించాలి. కోర్టు వ్యాఖ్యలు వివాహ వ్యవస్థ పట్ల గౌరవాన్ని పెంచేలా ఉన్నాయి. చట్టం, ఆచారం సమాంతరంగా సాగాలి. అప్పుడే వివాహ వ్యవస్థ దృఢంగా ఉంటుంది. పెళ్లి మనిషి వ్యక్తిత్వాన్ని మారుస్తుంది. పద్ధతులు పాటించడం ముఖ్యం. మంత్రాలు మనిషిని పునీతుడిని చేస్తాయి. వేడుకల్లోని హడావిడిలో అసలు విషయాన్ని మర్చిపోకూడదు. ఆచారం లేని పెళ్లికి నిలకడ ఉండదు.



### వివాహం సామాజిక ఒప్పందం కాదు

వివాహం అనేది కేవలం సామాజిక ఒప్పందం కాదు. ఇది ఒక దైవికమైన క్రియ. ఈ విషయాన్ని మనం గమనించాలి. హైకోర్టు తీర్పు ఒక దిశానిర్దేశం. వివాహం అంటే సంతకాలు కాదు, సంస్కారం అని నిరూపించింది. ఈ తీర్పు ద్వారా మనం కొత్తగా ఆలోచించాలి. వివాహ బంధంలోని పవిత్రతను కాపాడుకోవాలని సంప్రదాయవాదులు స్పష్టం చేస్తున్నారు. ఆచారాల వైభవాన్ని నిలుపుకోవాలి. నేటి తరం వేగంగా మారుతోంది. పెళ్లిళ్లలో వేగం పెరిగింది. కానీ మౌలిక విలువలు మారకూడదు. కోర్టు తీర్పు ఇదే చెబుతోంది. ఆచారాలే బంధానికి రక్షా కవచం.

# ఫ్రాన్స్‌లో రాజమౌళికి గోల్డెన్ ప్లేట్

## భారత చిత్రసీమకు అరుదైన గౌరవం




**భారతీయ చలనచిత్ర రంగానికి అసాధారణ గుర్తింపు దక్కింది. అంతర్జాతీయ యవనికపై తెలుగు దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి మరో అద్భుతం చేశారు. ఫ్రాన్స్‌లో ఆయన అందుకున్న గౌరవం ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సినిమా పుట్టిన గడ్డపై ఒక భారతీయ దర్శకుడికి లభించిన ఈ గౌరవం యావత్ దేశాన్ని గర్వపడేలా చేస్తోంది. ప్రపంచ సినిమా దిగ్గజాల సరసన ఆయన నిలిచారు.**
**- సహానం వందే, హైదరాబాద్**

- చరిత్ర సృష్టించిన టాలీవుడ్ దర్శకుడు
- ఘన సత్కారం... దిగ్గజాల సరసన స్థానం

ఫ్రాన్స్‌లోని లియోన్ నగరంలో ఉన్న ఇన్‌స్టిట్యూట్ లూమియర్ ఎస్ఎస్ రాజమౌళికి అరుదైన గౌరవం అందించింది. ఆయనకు అక్కడ గోల్డెన్ ప్లేట్‌ను బహుకరించారు. ఈ సంస్థ ప్రపంచ సినిమా చరిత్రలో అత్యంత కీలకమైనది. ఈ గౌరవం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇది ఆయన ప్రతిభకు దక్కిన అరుదైన గౌరవం.

### దిగ్గజాల సరసన

ఇన్‌స్టిట్యూట్ లూమియర్ లోని ఫిలిం మేకర్స్ వాల్ మీద ఇప్పుడు రాజమౌళి పేరు మెరుస్తోంది. అక్కడ మార్టిన్ స్కోర్సెస్, క్లింట్ ఈస్ట్వుడ్, క్వెంటిన్ టారంటినో వంటి ప్రపంచ స్థాయి దర్శకుల పేర్లు ఉన్నాయి. ఆ దిగ్గజాల సరసన రాజమౌళి చోటు సంపాదించారు. ఇది భారతీయ సినిమాకు లభించిన గొప్ప గుర్తింపు.

### భావోద్వేగ క్షణాలు

ఫ్రాన్స్ పర్యటన తనను తీవ్ర భావోద్వేగానికి గురిచేసిందని రాజమౌళి పేర్కొన్నారు. కేన్స్ ఫిలిం ఫెస్టివల్, ఇన్‌స్టిట్యూట్ లూమియర్ డైరెక్టర్ థియరీ ఫ్రేమాక్స్ ఆయనకు ఈ సర్‌ప్రైజ్ ఇచ్చారు. సినిమా పుట్టిన వీధిలోనే ఆయనను నడిపించి ఈ గౌరవం అందించారు. తానెంతో వినమ్రంగా ఉన్నానని ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు.

### అన్నెసీలో సత్తా

అన్నెసీ ఫిలిం ఫెస్టివల్‌లో రాజమౌళి సినిమాలకు అద్భుత స్పందన లభించింది. అక్కడ ఆయన తెరకెక్కించిన ఈగ, ఆర్ఆర్ఆర్, బాహుబలి చిత్రాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలకు ప్రపంచం నలుమూలల నుండి సినీ ప్రముఖులు తరలివచ్చారు. భారతీయ సినిమా వైభవాన్ని వారు కళ్ళారా చూశారు.

### అరుదైన అతిథి

ఆర్ఆర్ఆర్ ప్రదర్శనకు 93 ఏళ్ళ దిగ్గజ ఫ్రెంచ్ దర్శకుడు కోస్టా గావ్రాస్ హాజరయ్యారు. ఆయన తన భార్యతో కలిసి 8 గంటల పాటు సినిమాలు చూశారు. రాజమౌళి తెరకెక్కించిన మాస్టర్ క్లాస్ ను కూడా ఆయన వీక్షించారు. ఈ క్షణాలు తమకు ఎంతో స్ఫూర్తినిస్తాయని రాజమౌళి తనయుడు ఎస్ఎస్ కార్తికేయ తెలిపారు.

### వారణాసిపై ఆసక్తి

ప్రస్తుతం రాజమౌళి వారణాసి అనే భారీ ప్రాజెక్టుపై దృష్టి సారించారు. ఈ చిత్రంలో మహేష్ బాబు, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ నటిస్తున్నారు. బాహుబలి, ఆర్ఆర్ఆర్ సినిమాలతో ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చుకున్న రాజమౌళి నుంచి రాబోతున్న మరో అద్భుతం కోసం అందరూ ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంపై ఇప్పుడు భారీ అంచనాలు నెలకొన్నాయి.

# నెల దాటితే ముఖ్యమంత్రి ఔట్

## 30 రోజులు జైలుకు వెళ్తే పదవీ గండం

- వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో చట్టం
- ప్రధాని, సీఎం, మంత్రులందరికీ వర్తింపు
- కస్టడీకి వెళ్ళినప్పటికీ పదవి పోయినట్లే
- కస్టడీతోనే పదవికి ఎండ్ కార్డ్
- ఇది చట్టమా లేక రాజకీయ అస్త్రమా?

**అధికారం అంటే శాశ్వతం అనుకునే వారికి పార్లమెంటరీ కమిటీ ప్రతిపాదన ఒక హెచ్చరిక. నిందితుడిగా 30 రోజులు కస్టడీలో ఉంటే చాలు ముఖ్యమంత్రి లేదా ప్రధానమంత్రి అయినా కుర్చీ వదలాల్సిందేనని కమిటీ స్పష్టం చేస్తోంది. నేరం నిర్ధారణ కావాల్సిన అవసరం లేదు, కేవలం జైలు గడప తొక్కడమే పదవికి శాపంగా మారబోతోంది. ప్రజాస్వామ్య మూలాలను కదిలించే ఈ కీలక అంశంపై సమగ్ర విశ్లేషణ. - సహానం వందే, న్యూఢిల్లీ**



ప్రధాని లేదా ముఖ్యమంత్రులు 30రోజుల పాటు కస్టడీలో ఉంటే పదవి కోల్పోవాల్సిందే. ఇది చట్టంగా మారితే రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోతాయి. దేశంలోని అత్యున్నత పదవుల్లో ఉన్నవారికి ఈ చట్టం మెడపై కత్తిలా వేలాడుతుంది. ఇక కస్టడీని, జైలు శిక్షను మనం వేరుగా చూడాలి. కోర్టు శిక్ష పడితే పదవి పోవడం వేరు. కానీ ఇప్పుడు తెరపైకి వచ్చిన నిబంధన ప్రకారం కేవలం నెల రోజులు కస్టడీలో ఉన్నా చాలు.అంటే నేరం రుజువు కావడానికి ముందే కేవలం విచారణలో ఉన్నప్పుడే అధికారాన్ని కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. ఇది ముమ్మాటికి రాజకీయ అనిశ్చితికి దారితీసే అవకాశం ఉంది.

### తిరిగి అధికారం దక్కేనా?

జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత మళ్ళీ పదవిని చేపట్టవచ్చా అనే సందేహం సహజం. ఒకవేళ సదరు నాయకుడు నిర్దోషిగా బయటపడితే మళ్ళీ పదవిని చేపట్టే అవకాశం ఉండవచ్చు. కానీ ఆ నెల రోజుల్లో జరిగిన పాలనాపరమైన నిర్ణయాలు, సంక్షోభాల పరిస్థితి ఏమిటి. రాజకీయంగా కోల్పోయిన పట్టును తిరిగి సాధించడం అసాధ్యం. కాబట్టి ఈ నిబంధన ఆ నాయకుడి రాజకీయ ప్రస్థానాన్ని పూర్తిగా ముగించే అవకాశం ఉంది.

### రాజకీయ కక్షసాధింపునకు అవకాశం...

ఈ చట్టం ఒక ఆయుధంలా మారే అవకాశం ఉంది. రాజకీయ ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టాలని చూస్తే అక్రమంగా కేసుల్లో ఇరికించి 30 రోజులు కస్టడీలో ఉంచడం ఎంతో సులభం. అందుకే దీనిని అడ్డుకోవ డానికి కమిటీ నిబంధనలు రూపొందిస్తోంది. రాజకీయ కక్ష సాధింపులు లేకుండా కేవలం తీవ్రమైన నేరాలకు మాత్రమే పరిమితం చేయాలని కమిటీ భావిస్తోంది. ఇది అమలులోకి వస్తే రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోతుంది.

### చట్టపరమైన సవాల్

నేరం రుజువు కాకముందే అరెస్టు చేసి ఆ నెపంతో అధికారాన్ని తొలగించడం ప్రజాస్వామ్య విలువలను ప్రశ్నార్థకం చేస్తోంది. ఒకవేళ న్యాయస్థానం తర్వాత సదరు నేతను నిర్దోషిగా ప్రకటిస్తే ఆ 30 రోజులు పదవిలో లేనందుకు బాధ్యత ఎవరిది. ప్రభుత్వం ఈ చిక్కుముడిని ఎలా విడదీస్తుందో చూడాలి. పార్లమెంటులో దీనిపై చర్చ జరిగినప్పుడు ఇవే అంశాలు కీలకం కానున్నాయి.

### ప్రజాస్వామ్యానికి పరీక్ష

కేవలం చట్టం చేయడంతో సరిపోదు. దానిని అమలు చేసే విధానంలో పారదర్శకత ఉండాలి. 30 రోజుల కస్టడీని ప్రాతిపదికగా తీసుకోవడం ద్వారా నేర రహిత రాజకీయాలను ప్రోత్సహించాలని కమిటీ భావిస్తోంది. అయితే ఇది ప్రభుత్వాల కూల్చివేతకు కొత్త మార్గంగా మారకూడదు. జూలై 20 నుండి జరగబోయే పార్లమెంటు వర్షాకాల సమావేశాలు దీనికి వేదిక కానున్నాయి.

### 130వ రాజ్యాంగం సవరణ...

భారత రాజ్యాంగంలో 130వ సవరణ ద్వారా రాబోతున్న ఈ మార్పు దేశంలోనే అతిపెద్ద రాజకీయ మార్పు కానుంది. జూలై 17న కమిటీ నివేదిక సమర్పించిన తర్వాత అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షం ఎలా స్పందిస్తాయో చూడాలి. 30 రోజులు కస్టడీలో ఉన్న నేతలకు పదవీగండం తప్పని పరిస్థితి వస్తే ఇకపై రాజకీయ నాయకులు కస్టడీకి దూరంగా ఉండేందుకు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది.